క్లుప్తంగా

రూ.31 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సెక్రటరీ

ఒంగోలు అర్బన్: అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించే అమ్మప్రేమ ఫౌండేషన్‌కు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ద్వారా సెక్రటరీ సర్దార్‌బాష ఆర్థికసాయం అందజేశారు. హైదరాబాదు ఉప్పల్‌లో ఉన్న ఫౌండేషన్ నిర్వాహకురాలు అలివేలు అనారోగ్యంతో మంచం పట్టి ఫౌండేషన్ నడపలేక అక్కడున్న 25 మంది పిల్లలకు కనీసం తిండి కూడా పెట్టలేని స్థితిలో ఉండటంతో విషయం తెలుసుకున్న ఒంగోలుకు చెందిన సూర్యశ్రీ ట్రస్టు రూ.31 వేల ఆర్థికసాయం అందజేసింది. ట్రస్టు సభ్యుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డేటా సైన్స్‌లో అపారమైన ఉద్యోగ అవకాశాలు



రంగాచారి అచ్యుతరామన్‌కు జ్ఞాపిక అందిస్తున్న పేస్ కాలేజీ ప్రతినిధులు

ఒంగోలు: ఐటీ రంగంలో డేటా సైన్స్‌లో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెన్నైకు చెందిన సాఫ్ట్‌వేర్ నిపుణులు రంగాచారి అచ్యుతరామన్ తెలిపారు. స్థానిక పేస్ కాలేజీలో శనివారం నిర్వహించిన సొసైటీ ఫర్ డేటా సైన్స్ స్టూడెంట్ చాప్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉన్న ప్రాముఖ్యత గురించి వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ డేటా సైన్స్ ద్వారా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నిత్య సాధనతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. జిల్లా జేఏసీ చైర్మన్ శరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



బాలినేని శ్రీనివాసరెడ్డి, జంకె వెంకటరెడ్డి, మేయర్ గంగాడ సుజాతలను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ పదవులు పొందిన మహిళా నాయకులు



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న మారం వెంకారెడ్డి, పేరం శ్రీనివాసరావు, తదితరులు

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయండి

- వైఎస్సార్ సీపీ నగర కమిటీల్లో పదవులు పొందిన నాయకులకు ఎమ్మెల్యే బాలినేని పిలుపు



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న కటారి శంకర్, తదితరులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర కమిటీ, అనుబంధ విభాగాల నగర కమిటీల్లో పదవులు పొందిన పలువురు నాయకులు శనివారం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన ఇంటి వద్ద కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో పదవులు రావడానికి సహకరించినందుకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ఇన్నాళ్లు చర్యలు చేపట్టామన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ రెండు నెలలపాటు పార్టీ సేవకు అంకితమై పనిచేయాలని కోరారు. బాలినేనిని సత్కరించిన వారిలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు సుతారం శ్రీనివాసులు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ, నగర ప్రధాన కార్యదర్శి చిట్టిబోయిన రమణ, వైఎస్సార్ సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడు పుచ్చకాయల గోవర్దన్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పేరం శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోకూరి రామకృష్ణారెడ్డి, ఆయా కమిటీల్లో ఇతర పదవులు పొందిన పలువురు ఉన్నారు. బాలినేని వెంట నగర మేయర్ గంగాడ సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు తదితరులు ఉన్నారు.

మంగమూరు రోడ్డుకు ప్రకాశం పంతులు రోడ్డుగా నామకరణం

- ఆర్చి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు మెట్రో: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జ్ఞాపకాలను పెనవేసుకున్న ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డుకు ఆయన పేరుతోనే నామకరణం చేస్తూ ఆర్చి నిర్మాణానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ప్రకాశం పంతులు రోడ్డుగా నామకరణం చేస్తూ ఆర్చి నిర్మించనుండగా, శంకుస్థాపన ఏర్పాట్లను నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజాశంకరశాండిల్య, 28వ డివిజన్ కార్పొరేటర్ నీలంరాజు సరోజ రాఘవరావు, ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి, ఆంధ్రకేసరి సేవా సంస్థ, బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్, బ్రాహ్మణ సంస్థల ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. ప్రకాశం పంతులు పేరుతో స్వాగత తోరణాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని వారు పేర్కొన్నారు. కాగా, సోమవారం ఉదయమే కొత్తపేటలో బ్రాహ్మణ సేవా సమితి నూతన భవన నిర్మాణానికి బాలినేని చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు. అందుకు కావాల్సిన 250 గజాల స్థలాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో స్థానిక రంగారాయుడు చెరువు ధీరజ్ హాస్పిటల్ ఎదురుగా నగరపాలక సంస్థ పాలకవర్గం కేటాయించింది.

భారతరత్న పీవీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన...

స్థానిక రంగారాయుడు చెరువు వద్ద మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. దాంతో పాటు రూ.20 లక్షలతో మంగమూరు రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం దగ్గర సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని, ఈ పనులకు రూ.80 లక్షలతో టెండర్లు పిలిచామని, త్వరలో పనులు జరుగుతాయని 35వ డివిజన్ కార్పొరేటర్ గిరిజా శంకర శాండిల్య తెలిపారు.

తిరుమలలో వ్యాఖ్యాతగా పొన్నూరు



తిరుమల సప్తవాహన సేవలో వ్యాఖ్యానాన్ని అందిస్తున్న పొన్నూరు

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన రథసప్తమి వేడుకల్లో ఒంగోలుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రథసప్తమి సందర్భంగా ఒకే రోజు నిర్వహించే ఏడు వాహన సేవలలో మూడు వాహన సేవలకు పొన్నూరు శ్రీనివాస్ వ్యాఖ్యానాన్ని అందించారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి దేవస్థానంలో ఉదయం హంస వాహన సేవకు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు. అలానే, తిరుమల కొండపై జరిగిన రథసప్తమి వేడుకలలో సాయంత్రం కల్పవృక్ష వాహన సేవకు, రాత్రి చంద్రప్రభ వాహన సేవకు ప్రత్యక్ష వ్యాఖ్యానాన్ని అందించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానంలో వేలాది భక్తజన సందోహం మధ్య తన వ్యాఖ్యాన మాధుర్యాన్ని అందించిన పొన్నూరు శ్రీనివాసులును పలువురు ఆధ్యాత్మిక వేత్తలు అభినందించారు.

22 ఏళ్లుగా బాలినేని వెంటే..

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షునిగా నియమితులైన కటారి శంకర్



ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన కటారి శంకర్ గత 22 ఏళ్లుగా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వెంటే నడుస్తూ విశ్వాసానికి మారుపేరుగా నిలుస్తున్నారు. బీఏ బీఎల్ డిగ్రీతో పాటు మల్టీమీడియా కూడా పూర్తిచేసిన శంకర్.. ఉన్నత విద్యావంతుడు. 2002లోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి 2005 నుంచి 2010 వరకు ఒంగోలు మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేశారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం రాష్ట్రంలో జరిగిన పరిణామాలలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీని వీడి బాలినేని వెంటే నడిచారు. 2011 నుంచి 2017 వరకు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 2017 నుంచి 2022 వరకు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఒంగోలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సింగరాజు వెంకట్రావు అకాల మరణంతో ఆ బాధ్యతలను కూడా శంకర్ నిర్వర్తిస్తూ వచ్చారు. తాజాగా ఎమ్మెల్యే బాలినేని సిఫార్సు మేరకు నగర అధ్యక్షుడిగా కటారి శంకర్‌ను నియమిస్తూ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు బీసీ సంఘ అధ్యక్షునిగా పనిచేసి బీసీలు, బీసీ కుల సంఘాలకు ఏ అవసరం ఉన్నా తీరుస్తూ బీసీల అభ్యున్నతికి శంకర్ కృషిచేశారు. 2002-2004లో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యదర్శిగా, 2005-2006లో జిల్లా కన్వీనర్‌గా, 2006-2010లో జిల్లా అధ్యక్షునిగా, 2010-2014లో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, 2014-2024లో ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇవే కాకుండా 93 బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షునిగా 2002 నుంచి 2006 వరకు, బీసీ సంక్షేమ సాధన సమితి గౌరవ అధ్యక్షునిగా 2011 నుంచి 2013 వరకు, జనసభ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 2014 నుంచి 2019 వరకు పనిచేశారు. బీసీలను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారంతో పాటు బాలినేని వెంటే నడుస్తూ విశ్వాసాన్ని కనబరుస్తూ నగర అధ్యక్షునిగా నియామకం పొందిన కటారి శంకర్.. నాయకులు, కార్యకర్తల అభినందనలు అందుకుంటున్నారు.

ప్రజల మనిషి.. సుబ్బయ్య



సుబ్బయ్య సంతాప సభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: స్థానిక సత్యనారాయణపురంలో అనేక సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతగా పోరాటాలు చేసిన దేవరకొండ వెంకట సుబ్బయ్య ప్రజల మనిషిగా నిలిచిపోతారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.సిద్దయ్య కొనియాడారు. శనివారం స్థానిక దిబ్బలరోడ్డులో వెంకట సుబ్బయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య ప్రసంగిస్తూ... గత 20 సంవత్సరాలుగా సీపీఎంలో క్రియాశీలక సభ్యుడిగా పనిచేసిన సుబ్బయ్య.. సత్యనారాయణపురం ప్రాంత ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. సభలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

యోగా విద్యార్థులకు ప్రశంస పత్రాలు

ఒంగోలు సబర్బన్: స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన మహా సూర్య నమస్కార వందనం యోగా కార్యక్రమానికి హాజరైన ప్రతి విద్యార్థికీ ప్రశంస, ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.సుభద్ర తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. ఒంగోలు నగరంతో పాటు నాలుగు మండలాల్లోని 32 పాఠశాలల నుంచి 3,200 మంది విద్యార్థులు యోగా కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. 9 మాసాల నుంచి పాఠశాలల్లో యోగా అభ్యాసనం జరుగుతుందని, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 1.40 గంటల వ్యవధిలో 108 సార్లు సూర్య నమస్కారాలు చేసి రికార్డు సృష్టించారని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగులు అయిన విద్యార్థులు కూడా పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమానికి ఎస్‌వీ యోగా యూనివర్శిటీ ప్రో చాన్సిలర్ కంబంపాటి సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్యాం హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాన్ని జ్యూరీ సభ్యుడు డాక్టర్ శ్యాం, కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ అందజేశారని వెల్లడించారు.

షరీఫ్‌కు బూచేపల్లి పరామర్శ



షరీఫ్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని రామభద్రాపురం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఆదాం షరీఫ్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు శనివారం పరామర్శించారు. ఆదాం షరీఫ్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న వారు ఒంగోలులోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

బూచేపల్లి సాయం

దర్శి: పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన మేకల లింగమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు ఆపరేషన్ చేయించుకుంది. ఎన్నికల ప్రచారంలో ఉన్న బూచేపల్లి.. ఆమె అనారోగంతో బాధపడుతోందని తెలుసుకుని నేరుగా వెళ్లి రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు వీల్‌చైర్ అందజేస్తానని హామీ ఇచ్చారు. లింగమ్మ కుటుంబ సభ్యులు శివప్రసాదరెడ్డి దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సత్తాచాటిన గలిజేరుగుళ్ల విద్యార్థి

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న నారు వెంకట భరత్ ఈఈఎంటీ (ఎడ్యుకేషనల్ ఎఫీషణి మెరిట్ టెస్ట్)లో సత్తాచాటాడు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏడు, పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే మెరిట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో మూడో బహుమతి సాధించాడు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతి, ప్రశంసపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వరదారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థి భరత్‌ను అభినందించారు.

వేలం పాట రేపు

మార్కాపురం టౌన్: ఈనెల 19 సోమవారం ఉదయం పది గంటలకు అల్లూరిపోలేరమ్మ దేవస్థానంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి శనివారం తెలిపారు. ఆలయ పరిధిలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కు, అల్పాహారం, కూల్‌డ్రింగ్స్ వగైరాలు, అమ్మవారికి సమర్పించిన చీరెలు, రవికెలను సంవత్సర కాలం పరిధి పోగుచేసుకునే హక్కుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి



మారం వెంకారెడ్డిని సత్కరిస్తున్న పోకూరి, పేరం

చీమకుర్తి: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి కోరారు. పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా పోకూరి రామకృష్ణారెడ్డి, బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పేరం శ్రీనివాసరావుకు పార్టీ పదవులు రావడంతో వారిద్దరి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు శనివారం చీమకుర్తిలో మారం వెంకారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యదర్శులకు అధికారాలు కల్పించడంపై హర్షం

నాగులుప్పలపాడు: రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పరిపాలన బాధ్యతలైన డీడీఓ అధికారాలు కల్పించి జీఓ నంబర్ 11 ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రాయపూడి ఏలేస్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 6,500 మంది కార్యదర్శులు నాలుగున్నరేళ్లుగా డీడీఓ అధికారం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. నేటికి వారి కల నిజమైందని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వానికి తమ సంఘం తరఫున పలుమార్లు విన్నవించామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పందించడం శుభపరిణామమన్నారు. ఉద్యోగులు సక్రమంగా పనిచేసుకునేందుకు ఈ జీఓ తోడ్పడుతుందన్నారు.

పురుగుమందు తాగి చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

మద్దిపాడు: అనారోగ్యం కారణంగా పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న వృద్ధురాలు శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో నివాసం ఉంటున్న మేడూరి అంజేశ్వరరావు పూలమొక్కలకు మందు కొట్టడానికి పురుగు మందు తీసుకురాగా, ఈ నెల 5వ తేదీ అతని భార్య చేరెడ్డి పుల్లమ్మ (60) తాగి వాంతి చేసుకుంది. ఆమెను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తితో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.